# "లోకో భిన్నరుచిః"

శింగీతం శ్రీనివాసరావు

"లోకో భిన్నరుచిః"—ఇదొక వ్యాఖ్యానం కాదు. విమర్శ కాదు. కొన్ని వేల సంవత్సరాలలో మానవాభివృద్ధిని పరికిస్తూ, పరిశోధిస్తూ వక్కాణించిన ఒక అమోఘమైన సత్యం దీని తాత్పర్యం "లోకం భిన్న అభిప్రాయాలతో కూడుకొన్నది. లోకం—అంటే లోకంలోని ప్రజలు. ఇంకా బాగా చెప్తే లోకంలోని ఆలోచించే ప్రజలు. అంటే మిగతా వాళ్ళంతా ఆలోచించటం లేదా? ప్రపంచంలోని ప్రజలకందరికీ మెదడులో మట్టేనా అంటే అలా కాదు. ఎవరో ఒకాయన అన్నట్టు (విల్ రోజర్స్ అనుకుంటా) మనలో కొద్దిమందే ఆలోచిస్తారు. మిగతా వాళ్ళంతా ఊరకే ఊహించేవాళ్ళే. ఆ ఆలోచించే వాళ్ళు ఒకవస్తువును గురించి వారి విజ్ఞానాన్ని బట్టి, వారి స్వాతంత్ర్య భావాలను ప్రకటించే సామర్థ్యాన్ని బట్టి, ఆ వస్తువును, లేక ఆ వస్తువుతో సంబంధించిన ఒక సిద్ధాంతాన్ని విమర్శిస్తారు. ఇక్కడ వారి యొక్క రుచి, అభిరుచి ఉంటుంది. ఒకవస్తువును గురించి ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా వ్యాఖ్యానించవచ్చు. ఇప్పుడు నానోట్లో ఉండే సిగరెట్ ముక్క తీసి కిటికీగుండా పారవేశాననుకుందాం. అదే దృశ్యాన్ని ఒక కవిచూచాడంటే దాన్ని ఉన్నట్టుండి అంతరించిన ఒక చిన్న తోకచుక్కతో పోలుస్తాడు. అది శాస్త్రజ్ఞుడైతే సిగరెట్‌కు సమానాంతరంగా ఉన్న వేగాన్ని భూమ్యాకర్షణ శక్తిని లెక్కవేసి సిగరెట్ అనుసరించిన మార్గాన్ని నిర్ణయించటానికి ప్రయత్నిస్తాడు. నీతిని, ఆచరణీయ సిద్ధాంతాలను తర్కించే ఒకవ్యక్తి అది చూచినట్లైతే అందులో ఉండే కవిత్వాన్ని, విజ్ఞాన శాస్త్రాన్ని మరచిపోయి, అసలు సిగరెట్ తాగటం మంచిదా, కాదా? పోనీ తాగినట్లైతే దాన్ని బయటికి వెళ్ళి పారెయ్యకుండా కిటికీలోనుంచి దర్జాగా పారెయ్యటం సమంజసమా? ఇత్యాది ప్రశ్నలకు సమాధానాలివ్వటానికి పూనుకుంటాడు. ఈ విధంగా ఒక వస్తువును, ఒక దృశ్యాన్ని గురించి ఎవరి అభిప్రాయాలను వాళ్ళకు తోచినట్లు వాదిస్తారు. ఇలా ఇవ్వటానికి కొంత స్వాతంత్ర్యం, పరిజ్ఞానం, ఆలోచనా సామర్థ్యం ఉండాలి కనుక మనం ఇటువంటి విషయాల్లో ఆలోచించే ప్రజానీకాన్నే తీసుకోవలసి వస్తుంది.

ఇప్పుడు "యధారాజా, తధాప్రజా" అనే సిద్ధాంతాన్ని తీసుకుందాం. దీని తాత్పర్యం—రాజు ఎట్లాఉంటే ప్రజలు అదేవిధంగా ఉంటారు. రాజు అంటే ప్రజలను పాలించే ప్రభువు. పాలించే వ్యక్తిలో ఏ గుణములు, ఏ అభిప్రాయాలు వ్యక్తం అవుతాయో ప్రజలలో కూడ దానికి అనుగుణ్యమైన గుణాలు, అభిప్రాయాలు వ్యక్తం అవుతాయి. "అనుగుణ్యమైన" అని వాడాను. ఎందుకంటే రాజుగుణాలే 'తుచ' తప్పకుండా ప్రజలలో వెల్లడికావటం అసంభవం. రాజు ఒకగొప్ప కళా పిపాసి, కవులను ఆదరించే వాడనుకుందాం. (అతను కవి కాకపోయినా) ఇక్కడ రాజులో ఉండే గుణం ఏమిటంటే కవులను ఆదరించటం. అప్పుడు ప్రజలకు అబ్బే గుణం రాజుమాదిరి కవులను ఆదరించటం కాదు. కవులుగా కావటం. అందువల్ల రాజు కవులను ఆదరించటానికి ప్రయత్నిస్తారు. అంటే రాజుయొక్క గుణాలకు అనుగుణ్యమైన గుణాలు ప్రజలలో అలవడుతాయి. రాజు సైనికులను గౌరవిస్తే, ప్రజలు సైనికులవటానికి ప్రయత్నిస్తారు. రాజు, ఆయన అనుచరులు త్రాగుబోతులైతే ప్రజలు సారాయి అంగళ్ళను అభివృద్ధిచేస్తారు. రాజు త్రాగుబోతై, పైకి నీతిపరునిమాదిరి కనిపించటానికి తనరాజ్యంలో త్రాగుబోతుతనాన్ని నిషేధిస్తే, ప్రజలు చాటుగా సారాయి అమ్మటానికి ఎత్తులువేస్తారు. అయితే ఒకటిమాత్రం రాజు ప్రజలు ఒకరినొకరు కొంతవరకు అనుకరిస్తారు. రాజు ప్రజల జేబులు కొట్టిస్తే, ప్రజలు వారి జేబులు కాపాడుకోవటం చేతకాక, రాజు జేబు కొట్టెయ్యలేరు కనుక, ఒకరి జేబులు ఇంకొకరు

ఖాళీచెయ్యటానికి ప్రయత్నిస్తారు. ఇదంతా చరిత్రకు సంబంధించిన సిద్ధాంతం.

అయితే చరిత్రకారుడు ఈ సిద్ధాంతాన్ని ప్రకటించటానికి ముందు చరిత్రలో దీన్ని నిరూపించే ఘట్టాలను కావలసినన్ని జ్ఞాపకముంచుకోవాలి. కాబట్టి అతను "యథారాజా తథా ప్రజా" అన్నాడంటే అది ఎట్లా అనే సంగతి చెప్పటానికి నిరూపించటానికి యత్నిస్తాడు. అశోకుని కాలంలో యుద్ధవిముఖుడైన రాజువల్ల సైనికశిక్షణ పొందలేని ప్రజలు, శ్రీ కృష్ణదేవరాయల కాలంలో కవులను ఆదరించే రాజు పరిపాలన క్రింద కవిత్వంలో ఆసక్తి చూపిస్తూ, కవులు కావటానికి ప్రయత్నించే ప్రజలు, ఆంగ్ల ప్రభుత్వంకింద భారతదేశంలో ప్రభువుల వేషభాషలను అనుకరిస్తూ, అక్షరం రాకపోయినా అహంకారాన్ని కలిగిన ప్రజలు, ఈ రోజులలో ప్రభువుల అవినీతిని, బూటుకాలను అతి సునాయాసంగా అంటువ్యాధివలె తీసుకునే ప్రజలు - ఇత్యాది ఘట్టాలన్ని చరిత్రకారుడు స్పష్టంగా చిత్రిస్తాడు.

అయితే "భిన్నరుచిః" అన్నప్పుడు ఒక మాటను వివిధ వ్యక్తులు వివిధ అభిప్రాయాలను వెల్లడించవచ్చు. అంటే ఆ మాటకు వేరేవేరే అర్థాలుతీసి వ్యాఖ్యానించినాసరే, లేక ఒకే అర్థం తీసి వేరేవేరే వ్యాఖ్యానాలిచ్చినా సరే. అటువంటప్పుడు "యథారాజా తథాప్రజా" అనే మాటను ఒక చరిత్రకారుడిదగ్గరకాక ఒక భూగోళశాస్త్రజ్ఞునిదగ్గర అన్నామనుకోండి. ఆ మాటకు అతనింకొక వ్యాఖ్యానం ఇస్తే ఆశ్చర్యపడవలసిన పనిలేదు. భూగోళశాస్త్రజ్ఞుని ప్రకారంకూడా "యథా రాజా తథా ప్రజా" అంటే రాజు ఏవిధంగా ఉంటే ప్రజలు దానికి అనుగుణ్యంగా ఉంటారు. అయితే ఇక్కడ రాజు-అంటే దిన రాజు—సూర్యుడు. రాజులేక సూర్యుడు ఏవిధంగా లేక ఏ స్థితిలో ఉంటే ప్రజలు దాన్ని బట్టి ఉంటారు. సూర్యుడు తన ప్రయాణంలో యెక్కువ కాలం భూమధ్యరేఖమీద ఉంటాడు. అంటే ఆ ప్రాంతంలో వేడిమి ఎక్కువ అవటంవల్ల అక్కడి ప్రజలు నల్లగా ఉంటారు. అక్కడ అడవులు ఎక్కువ. అందువల్ల వారి నివాసాలు, ఆహారం పరిసరాల ననుసరించి ఉంటుంది. ఇక సూర్యుడు కర్కాటక మకరరేఖలమీద సంవత్సరానికి ఒక్క పర్యాయమే ఉంటాడు. కాబట్టి అక్కడ సూర్యుడు లేక రాజుయొక్క స్థితి తీక్షణంగావుండదు. కాబట్టి ప్రజలు కొద్దిఎరుపుగా ఉండి ఉష్ణానిచ్చేఆహారాన్ని తింటారు. సూర్యుడే తాకని ధృవములలోని ఎస్కిమోజాతి ప్రజల జీవితమే వేరు. ఒక్కదేశంలోనే ప్రజలయొక్క నడవడిలో చలికాలంలో, వేసవికాలంలో ఎంతో భేదం ఉంటుంది. అంతేకాదు. ఒక్కరోజులోనే ఒకవ్యక్తియొక్క పోకడలు పొద్దున్నకు, మధ్యాహ్నానికి, సాయంకాలానికి, రాత్రికి తారతమ్యం అగుపడ్తుంది. దీనికి కారణం ఈవిధంగా వివరించవచ్చు ఒక మనిషియొక్క పోకడే అతని మనస్తత్వంపై ఆధారపడియుంటుంది. అతని మనస్తత్వం చాలమట్టుకు (అతని వ్యక్తిగతమైన విషయాలను వదిలిపెట్టి) , పరిసర ఉష్ణోగ్రతమీద ఆధారపడి ఉంటుంది. అంటే మరీ ఎండగా ఉన్నప్పుడు ఆఫీసులోనైనాసరే పండుకోవాలనిపిస్తుంది. రాత్రి చల్లగా ఉన్నప్పుడు ఇంట్లో ఉన్నప్పుడు సైతం ,ఫైల్స్ చూడాలనే బుద్ధి పుడ్తుంది. ఈ ఉష్ణోగ్రత ఆకాశంలో సూర్యుని యొక్క స్థితినిబట్టి ఉంటుంది. అంటే సూర్యుడు రాజు ఎలాఉంటే ప్రజలు దానికి అనుగుణ్యంగా ఉంటారు.

అలాంటప్పుడు రాజు అంటే చంద్రుడుకాదా? కాబట్టి చంద్రుడు ఏవిధంగా ఉంటే ప్రజలు ఆ విధంగా ఉంటారు అని ఒక కవి అవచ్చు. తప్పేమిలేదు. పౌర్ణమి రోజులలో ఉత్సాహంగా ఇసుక తిన్నెలమీద చెడుగుడు ఆడుకునే పిల్లకాయలు, స్వేచ్ఛయైన ఊహలకు అవకాశాలిచ్చే ప్రేమికులు (ఇది చెప్పని కవి ఉండడు) అమావాస్య రోజులలోని అవ్యక్తమైన నిరుత్సాహం అందరికీ తెలిసిందే. ఎట్లాగైనా కవి అనేదేమంటే "యథారాజా, తథాప్రజా."

ఇక్కడ మనం చూచిందేమంటే ఒక సిద్ధాంతాన్ని వివిధమైన దృక్పథాలతో ఎవరికి గోచరించినట్లు వారుచూచారు. అయితే ఒక సత్యాన్ని గురించి ఆలోచించి, ఆ సత్యానికి ఒకే అర్థంలో వివిధమైన వ్యాఖ్యానాలను ఇచ్చినాకూడా, వివిధ అభిప్రాయాలను వెల్లడించినట్లే, ఇప్పుడు మనం తీసుకోనబోయే సత్యం చాలా విదితమైనది. ఏమి

టంటే సూర్యుడు తూర్పున ఉదయించి సాయంకాలానికి పడమరని అస్తమిస్తాడు ఇదిఒక సత్యం. ఎవ్వరూ కాదనలేరు. ఈ సత్యానికి కారణాలను వెదకటంలో ఉంది మానవుని ప్రజ్ఞ. ఇటువంటి వాటిలో భిన్నాభిప్రాయాలను వెల్లడించటం కష్టం. ఆవిధంగా వెల్లడించిన దానివల్ల కలిగే లాభం అత్యధికం.

చాల సంవత్సరాలకు ముందు భూమి నిశ్చలంగా ఉన్నట్లుగానేఉందని చాలామంది వేదాంతుల అభిప్రాయం. అయితే మధ్య గెలీలియో అనే శాస్త్రజ్ఞుడు ఎక్కువ పరిశోధనతో, ఆలోచించి ఒక చిన్న అభిప్రాయాన్ని వెల్లడించాడు. దీనిప్రకారం సూర్యుడు భూమిచుట్టు తిరగటం లేదు. భూమి సూర్యుడు చుట్టు తిరుగుతుంది. రైలులో కూర్చున్నవానికి కొండలు చెట్లు ఏ విధంగా పరుగెత్తినట్లగుపడ్తుందో ఆదేవిధంగా మనకు సూర్యుడు అగుపడ్తాడని గెలీలియో అన్నాడు. ఇది ఒక విశిష్టతమైన అభిప్రాయం. కాని అది అంతిమ సత్యం అని తీసికొనటం పొరబాటు. దాన్ని పరిశోధన చేసి, ఆలోచించి, దానిమీద స్వతంత్ర భావాలనిచ్చే అధికారం ప్రతిమానవునిది. అందువల్లనే ఇప్పుడు నూతనంగా మనకు ఐన్‌స్టిన్ అభిప్రాయం లభ్యపడింది. దానిప్రకారం భూమి, సూర్యుడు, చంద్రుడు ఇవన్నీ ఎట్లాతిరుగుతున్నాయంటే ఒకతట్ట చేత్తోపట్టుకొని తిప్పితే అందులో ఉంచబడిన ఒకగోలీ ఏ విధంగా తిరుగుతుందో అదే విధంగా విశ్వంలో క్షణక్షణానికి కలిగే కొన్ని మార్పులవలన ఈ గ్రహాలన్నీ తిరుగుతున్నాయి. ఇంతగొప్ప సిద్ధాంతాన్ని ఊహించటమే కష్టం.

దీనివల్ల మనం గ్రహించేదేమంటే విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి చెందుతూండటం అభిప్రాయాలలోని బేధం వల్ల. భూమి చదరంగా ఉందని ఎవరో, ఎప్పుడో చెప్పి ఆదేవిధంగా మనమంతా ఒప్పుకొని వివిధ అభిప్రాయాలను వెల్లడించకుండా ఉండి ఉంటే ఈవేళకు మనం ఇప్పుడున్నస్థితికి వచ్చే ఉండము. మధ్య ఎవరో భూమి గుండ్రంగా ఉందని చెప్పితీరాలి. అప్పుడే నావికాయాత్ర, వ్యాపారం అంతా వృద్ధి పొందుతుంది. భిన్నాభిప్రాయాలవల్లప్రతిశాస్త్రంవృద్ధిపొందాలి.

అయితే “లోకో భిన్నరుచిః” అనే మాట ఒక్కొక్కప్పుడు చాల నీచమైన అంతస్తులకు లాగబడ్తుంది. ఎవరైనా ఒకవక్తిని గురించి మాట్లాడుకునేటప్పుడు (అసలు అట్లామాట్లాడటమే సగంతప్పు) ఒకరు ఆయనను సన్మార్గుడని, ఒకరు దుర్మార్గుడని, ఒకరు మూర్ఖుడని, ఒకరు సనాతనుడని ఒకరు “అతి తెలివి” మనిషని, ఈ విధంగా ఆయనను గురించి నానా విధాలుగా మాట్లాడుకుంటారు. ఇటువంటి వ్యాఖ్యానాలకు గొప్పబుర్రలు అవసరంలేదు. ఇవి అసలు అభిప్రాయాలుకాదు. నోటికి వచ్చిన వాగుళ్ళు. ఇటువంటివి దారిలో త్రాగుబోతుల కొట్లాటలకు, ఒకరినొకరు తిట్టుకునే మూర్ఖులైన స్త్రీల మాటి విరుపులకు, ఏమాత్రం తీసిపోవు. అటువంటి సంఘటనలను లెక్కచెయ్యకుండా ఉండటం పోనిచ్చి, తలో ఒకమాట అనే వాళ్ళనందరినీ సిద్ధాంతీకరించి “లోకోభిన్నరుచిః” అని నుడివి చప్పరించటం అసమంజసం, అన్యాయం కూడా. ఒకహోటల్లోని కాఫీ ఒకరికి బాగుండవచ్చు, ఒకరికి బాగలేకపోవచ్చు, సామాన్యంగా నాట్ బేడ్‌గా ఉండవచ్చు. కాని అటు చిన్నదాన్ని పట్టుకొని దానికి “లోకోభిన్నరుచిః” అనటము ఒక గొప్పసిద్ధాంతాన్ని ఒకనీచమైన అంతస్తులలోనికి లాగడంగా ఉంటుంది. లోకంలో ఆలోచించే వివిధ వ్యక్తులు వాఙ్మయం, కవిత్వ, కళ, శాస్త్రం, ధర్మం, మతం, సంఘం, శాస్త్రీయమైన రాజకీయం మున్నగు వానిని గురించి భిన్న అభిరుచులను, అభిప్రాయాలను వెల్లడిస్తేనే మనం మానవ పరిణామంలో ఇంకొక మెట్టు వేయగలుగుతాం.

